సాక్షి
వరంగల్
గురువారం । 11 । జూలై । 2024



తులసి.. మెరిసి
మూలుగు జిల్లా తాడ్వాయి మండలం తక్కళ్ల పాడు గొత్తికోయ గూడేనికి చెందిన పునేం తులసి 'డ్రామా జూనియర్స్'లో అద్భుతంగా నటించి గూడేన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లింది.
- 8లో▸



ప్రత్యేక ప్యాకేజీ టూర్
కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా ఐఆర్‌సీటీ దివ్య దక్షిణ జ్యోతిర్లింగ యాత్ర ప్యాకేజీ టూర్‌ను ప్రవేశపెట్టింది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /25^0
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మత్స్యకారులు పథకాల్ని వినియోగించుకోవాలి

హన్మకొండ చౌరస్తా: మత్స్యకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, చేపల ఉత్పత్తిలో అభ్యున్నతి సాధించాలని హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ తిరుమణి విజయభారతి అన్నారు. వరంగల్, హనుమకొండ మత్స్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో జాతీయ మత్స్య దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన చేపపిల్లల ఉత్పత్తిదారుడు పట్టాభిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వరంగల్ డీఎఫ్‌ఓ నరేశ్ నాయుడు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు నోటీసులు

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌కు ఆడిట్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఎంజీఎంలో మందులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్‌లో భారీగా తేడా రావడంతో 30 అంశాలపై లెక్కలు, దానికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని ఆడిట్ అధికారులు గతంలోనే నోటీసులు ఇచ్చారు. దానికి సమాధానం రాకపోడంతో మరోసారి నోటీసులు జారీచేశారు. సంబంధిత లెక్కలు, బిల్లులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంజీఎంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే.. క్రిమినల్ కేసులు నమోదు చేసి డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. గతంలో సూపరింటెండెంట్లపై అనేక ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం చంద్రశేఖర్‌ను సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. ఈయన కూడా అదేదారిలో నడవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

లోకాయుక్త విచారణకు డుమ్మా

- హాజరుకాని అసిస్టెంట్ కమిషనర్



వరంగల్: వరంగల్, హనుమకొండ పరిధి దేవాలయాలకు సంబంధించిన భూమి యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతోంది. అయినప్పటికీ పట్టించుకునే అధికారి లేకుండా పోయారు. ఆలయాల నిర్వహణ కోసం కేటాయించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వినియోగదారుల మండలి పలుమార్లు కలెక్టర్లకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో వినియోగదారుల మండలి రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. లోకాయుక్త ఆదేశాలతో రంగంలోకి దిగిన యంత్రాంగం పద్మాక్షి దేవాలయం, వీరపిచ్చమాంబ, రంగనాయకస్వామి, సిద్ధేశ్వర స్వామి దేవాలయం, వేణుగోపాలస్వామి ఆలయం మొత్తం ఐదు దేవాలయాలకు సంబంధించిన 20.39ఎకరాల భూమిని 69 మంది కబ్జా చేసినట్లు 05.01.2022వ తేదీన నిర్ధారించారు. నిర్ధారించిన ఎండోమెంట్ అధికారులు వారి ట్రిబ్యునల్‌లో కేసులను నమోదు చేయాల్సి ఉంది. అయినప్పటికీ అధికారులు కబ్జాను నిర్ధారించి రెండేళ్లు దాటినా.. ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో కేసులు నమోదు చేయకుండా.. ఆలస్యం చేస్తూ.. 882 సర్వే నంబర్‌లోని 32 గుంటల భూమిని సర్వహిత ఎడ్యుకేషనల్ సొసైటీకి అగ్రిమెంట్ చేయడంపై వినియోగదారుల మండలి తాజాగా లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. దీంతో 10-07-2024 రోజున తన ఎదుట హాజరు కావాలని లోకా యుక్తా జస్టిస్ సీవీ.రాములు ఆదేశించారు. బుధవారం జరిగిన విచారణకు అసిస్టెంట్ కమిషనర్ హాజరు కాలేనందున వెంటనే, వారంలోపు ఈనెల 15న హాజరు కావాలని లోకాయుక్త జస్టిస్ సీవీ.రాములు ఆదేశాలు మరోసారి జారీ చేశారు. విచారణకు పద్మాక్షి, సిద్ధేశ్వర, వీరపిచ్చమాంబ, రంగనాయకస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాలకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ అధికారులు ప్రసాద్, వెంకటయ్య, రత్నాకర్‌రెడ్డి మాత్రం హాజరయ్యారు. భూములు కబ్జా చేసిన వారిపై ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో కేసులు నమోదు చేయడంతో పాటు ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని చక్రపాణి, రాజు డిమాండ్ చేశారు.

మత్స్యకారులకు బీమా

ఒకటి నుంచి ప్రధానమంత్రి మత్స్యబీమా యోజన అమలు

- నూతన నిబంధనలు, మార్గదర్శకాలతో ఇబ్బందులు
- పాన్‌కార్డు, ధ్రువీకరణ పత్రాలు లేకుంటే క్లెయిం తిరస్కరణ
- జిల్లాలో 184 మత్స్య సహకార సంఘాలు.. 15,741 మంది సభ్యులు



చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు(ఫైల్)

చెన్నారావుపేట: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బీమా పథకాన్ని తీసుకొచ్చింది. ప్రధాన మంత్రి మత్స్యబీమా యోజన కింద పరిహారం పొందేందుకు ఈనెల ఒకటి నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. దీంతో మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో మృతి చెందిన మత్స్యకారుడి కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు సంఘం సభ్యత్వాన్ని పరిగణనలోకి తీసుకునేవారు. ఎలాంటి నిబంధనలు లేకుండా నేరుగా చెల్లించేవారు. ప్రస్తుతం మారిన నిబంధనల ప్రకారం మృతి చెందిన మత్స్యకారుడి కుటుంబానికి బీమా పరిహారం అందాలంటే తప్పనిసరిగా కొన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.

నిబంధనలు..

మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి మత్స్యబీమా యోజన కింద పరిహారం పొందడానికి అర్హులు. మత్స్యకారుల బీమా ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. సంఘంలో ఏ సభ్యుడైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.2.05 లక్షలు, ప్రమాదం జరిగితే రూ.25 వేలు పరిహారం అందేవిధంగా మార్గదర్శకాలు రూపొందించారు. ప్రమాదంలో చనిపోతే గతంలో పాన్‌కార్డు లేకుండానే పరిహారం అందించేవారు. మారిన కొత్త నిబంధనల ప్రకారం తప్పనిసరిగా సభ్యుడు పేరున పాన్‌కార్డు ఉండాలి. బీమా సౌకర్యాలు పొందడానికి ఆయా సంఘాల్లో సభ్యత్వ కార్డులు ఉన్న మత్స్యకారులు వ్యక్తిగత ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డు, ఇతర ధ్రువప్రతాలతోపాటు ఫోన్ నంబర్‌తో జీఏఐఎస్ సైట్‌లో నమోదు చేసుకోవాలి. జిల్లాలో 139 పురుష మత్స్య సహకార సంఘాల పరిధిలో 12,341 మంది సభ్యులు ఉన్నారు. మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 45 ఉన్నాయి. అందులో 3,400 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ పీఎం మత్స్య బీమా యోజన కిందకు వస్తారు. మారిన నిబంధనల ప్రకారం బీమా పరిహారం కోసం కొత్తగా వీరు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు 14,241 మంది సభ్యులు ఈ పథకం కోసం వివరాలు అందించారని, మరో 1500 మంది వివరాలు అందించాలని జిల్లా అధికారులు తెలిపారు.

నిబంధనలు సవరించాలి..

మత్స్యకారులకు ఈ పథకం బాగానే ఉన్నా మారిన కొత్త నిబంధనలు, మార్గదర్శకాలు చాలా కఠినంగా ఉన్నాయి. దీంతో ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న సభ్యులకు ఏం చేయాలో తోచడం లేదు. ప్రస్తుతం పాన్‌కార్డులు పొందడానికి ఉన్న నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుడు తప్పనిసరిగా చేతి రాతతో సంతకం చేయాల్సి ఉంటుంది. సంతకం లేకుంటే పాన్‌కార్డు జారీ చేయడం కుదరదు. మత్స్యకారులు చాలా మంది నిరక్షరాస్యులు ఉండటంతో పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో వారు బీమా పరిధిలోకి వచ్చే అవకాశాలు లేవు. దీనిని సవరించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జిల్లాలో మత్స్య సహకార సంఘాలు, సభ్యుల వివరాలు..

మొత్తం మత్స్య సహకార సంఘాలు	: 184
ఎన్నికలు జరిగినవి	: 180
మొత్తం సభ్యులు	: 15,741
పురుష సంఘాలు	: 139
సభ్యులు	: 12,341
మహిళా పారిశ్రామిక సంఘాలు	: 45
సభ్యులు	: 3,400
ఇప్పటి వరకు క్లెయిమ్ అయినవి	: 14

మరోసారి అవకాశం కల్పించాలి



గతంలో ఉన్న బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే చనిపోయిన 49 కార్మికుల కుటుంబాలకు డబ్బులు రాలేదు. అధికారులు ప్రత్యేక చొరవతో మరోసారి అవకాశం కల్పించాలి. ఈ పథకంపై సభ్యులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. సభ్యులు భయాందోళన చెందొద్దు.

– కాట కుమారస్వామి, ముదిరాజ్ సంఘం యూత్ జిల్లా కన్వీనర్

షరతులు లేకుండా బీమా పథకం వర్తింపజేయాలి



కొత్త నిబంధనల ప్రకారం పాన్ కార్డు తప్పనిసరి అంటున్నారు. నేను చదువుకోలేదు. పేరు రాస్తేనే పాన్‌కార్డు వస్తది అంటున్నారు. పేరు రాయడం నేర్చుకుని పాన్‌కార్డు తెచ్చుకుంటాను. అప్పటి వరకు షరతులు లేకుండా బీమా పథకం వర్తింపజేయాలి.

– పిట్టల భద్రయ్య, తిమ్మరాయినిపహాడ్, సంఘం సభ్యుడు

ఆందోళన చెందకూడదు..



మత్స్యకారులు ప్రధానమంత్రి బీమా యోజన పొందడానికి మారిన నిబంధనల ప్రకారం వివరాలు అందించాలి. ఆందోళన చెందాల్సి అవసరం లేదు. ప్రతి సభ్యుడి వద్ద పాన్‌కార్డు ఉండాలన్న నిబంధన తప్పనిసరి అని కాదు. క్లెయిం తీసుకునేటప్పుడైన పాన్‌కార్డు అందించాల్సి ఉంటుంది.

– పి.నరేశ్‌కుమార్‌నాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఘనంగా కోటమైసమ్మ బోనాలు



బంగారు బోనంతో వెళ్తున్న మంత్రి కొండా సురేఖ

- బంగారు బోనమెత్తిన మంత్రి సురేఖ
- భారీగా తరలివచ్చిన భక్తజనం

గీసుకొండ: మండలంలోని కోటగండి కోటమైసమ్మ బోనాల పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. అంతకు ముందు అమ్మవారి ఆలయం వద్ద గొర్రెలు, మేకలను బలిచ్చారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వంచనగిరి నుంచి బంగారు బోనం ఎత్తుకుని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటమైసమ్మ ఆలయానికి వెళ్లారు. భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో మంత్రి కూతురు సుష్మితాపటేల్, అల్లుడు అభిలాష్, కొండా సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, కొమ్ముల కిశోర్, మీసాల ప్రకాశ్, రడం భరత్, బీరం సుధాకర్‌రెడ్డి, బొల్లం శివ, మాజీ సర్పంచ్ అనసూర్య, మాజీ ఎంపీటీసీ రజితసారంగం, బండి రాజు, కొండ వెంకన్న, బొమ్మగాని శ్రీనివాస్,స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు. గుర్రాలపై రౌతులు, గుర్రపు బండి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏసీపీలు తిరుపతి, నందిరాంనాయక్, సీఐలు బాబూలాల్, రామకృష్ణ, గోపి, రమేశ్, మల్లయ్యతోపాటు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సేవలు విస్తరించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి
- రాయపర్తిలో 60 మంది దివ్యాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ



దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

రాయపర్తి: పేద ప్రజలకు సేవలందిస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.21 లక్షల విలువైన బ్యాటరీ వాహనాలను 60 మంది దివ్యాంగులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫౌండేషన్ సేవలను విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, కాకిరాల హరిప్రసాద్, సురేందర్‌నాయక్, మాచర్ల ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా సంక్షేమ పథకాల అమలు

- కలెక్టర్ సత్య శారదాదేవి




మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాళోజీ సెంటర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులు, పథకాల అమలు పురోగతిపై ఆయా శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యంలో 45 శాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. ఆగస్టు చివరి నాటికి 100 శాతం మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేసి పరిరక్షించాలన్నారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా 438 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి, 232 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో కూడా వారం రోజుల్లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. మహిళా క్యాంటీన్లు, మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అర్హత, ఆసక్తి గల మహిళలకు శిక్షణ ఇచ్చి, బ్యాంకు లింకేజీ రుణ సౌకర్యం కల్పించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కిసాన్ మోర్చా అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

కాళోజీ సెంటర్: ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. కౌలు రైతులకు రైతు భరోసా నేటికీ ఇవ్వలేదని మండిపడ్డారు. రైతు గోస తగలడంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దిగిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో నిజాయితీ లేదని ఆరోపించారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను చేపట్టేందుకు బీజేపీ వెనుకాడదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళిదాసు, రఘునారెడ్డి, బాకం హరికృష్ణ, గందె నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హైవేల నిర్మాణంపై నజర్

ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే ఎన్‌హెచ్‌ల పురోగతిపై సీఎం రేవంత్ సమీక్ష

- మంచిర్యాల టు విజయవాడ, వయా వరంగల్ నేషనల్ హైవే పనులకు సమస్యగా భూసేకరణ
- సత్వరమే పూర్తయ్యేలా కలెక్టర్లతో కాన్ఫరెన్స్
- వేగం పుంజుకోనున్న నేషనల్ హైవేల నిర్మాణం



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారుల నిర్మాణ పనులకు ఇక అడ్డంకులు తొలగనున్నాయి. ప్రధానంగా జేఎస్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాల మీదుగా వెళ్లే మంచిర్యాల–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి భూసేకరణ ప్రధాన సమస్య కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి జాతీయ రహదారులకు భూసేకరణ ప్రక్రియపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంచిర్యాల–వరంగల్ – ఖమ్మం – విజయవాడ ఎన్‌హెచ్ 163జీ, జగిత్యాల – కరీంనగర్ – వరంగల్ ఎన్‌హెచ్ 163 నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.

310 కిలోమీటర్ల ఎన్‌హెచ్.. భూసేకరణే అసలు సమస్య..

మంచిర్యాల – వరంగల్ – ఖమ్మం – విజయవాడ ఎన్‌హెచ్ 163జీ మన రాష్ట్రంలో దాదాపు 310 కిలోమీటర్ల మేర ఉండగా, దీనికి సంబంధించి 1,383 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 1,284 హెక్టార్ల భూమికి అవార్డు పాస్ చేశామని, 415 హెక్టార్ల భూమి జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 16జీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియ నెలరోజుల వ్యవధిలో పూర్తి చేయాలని భూపాలపల్లి, వరంగల్ కలెక్టర్లకు సూచించారు. భూ సేకరణ అవార్డు పాస్ చేసి భూ బదలాయింపు జరగని సంబంధిత రైతులు, భూ యజమానులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ టేకుమట్ల, మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల్లో 25 కి.మీ మేర జాతీయ రహదారి నిర్మాణానికి 130.5 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. భూ సేకరణకు పరిహారంతో రైతులు సంతృప్తి చెందక భూములు అప్పగించడం లేదని, రైతులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా సిరొంచ నుంచి మహదేవపూర్ వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన 20.909 హెక్టార్ల అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా సీఏ భూమి కేటాయింపునకు రెవెన్యూ, అటవీ, జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు సంయుక్త సర్వే చేసి అటవీ శాఖకు అప్పగించనున్నామన్నారు.

ఉమ్మడి వరంగల్‌లోనే ఎక్కువ నిడివి...

మంచిర్యాల – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎక్కువ నిడివి ఉమ్మడి వరంగల్‌లోనే ఉంటుంది. మంచిర్యాల నుంచి ఖమ్మం వరకు 219 కిలోమీటర్లు ఉండగా, సుమారు 2,885 ఎకరాల భూసేకరణ అవసరం ఉంది. మంచిర్యాల నుంచి వరంగల్ మధ్య మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలను మినహాయిస్తే.. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, వరంగల్, పరకాల, ఆత్మకూరు, శాయంపేట, దామెరతోపాటు ఆయా మండలాల పరిధిలోని 24 వరకు గ్రామ శివారులు ఉంటాయి. మంచిర్యాల – వరంగల్ మధ్యన 112 కిలోమీటర్ల రోడ్డు నిడివి ఉంటే.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 80 కిలోమీటర్లు మేర ఉంటుంది. ఇందుకు అత్యధిక భూసేకరణ చేయాల్సి ఉంది. అదే విధంగా వరంగల్–ఖమ్మం మధ్యన వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో ఊరుగొండ, గీసుకొండ, మచ్చాపూర్, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, వెంకటయ్యపాలెం ఉన్నాయి. ఈ రోడ్డు పొడవు 107 కిలోమీటర్లు కాగా వెంకటయ్యపాలెం మినహాయిస్తే 1,410 ఎకరాల భూసేకరణ ఉమ్మడి జిల్లాలో అవసరం. ఇప్పటికీ 80శాతం భూసేకరణ జరగ్గా.. మిగిలిన భూమి ఇచ్చేందుకు రైతుల ససేమిరా అంటున్నారు. 'మా భూముల లాక్కోవద్దంటూ' ఆందోళనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం సమీక్ష, ఆదేశాలు, సూచనల మేరకు అధి కారులు భూసేకరణ సమస్యకు ఫుల్‌స్టాప్ పెడితే ఎన్‌హెచ్ పనులు వేగం పుంజుకోనున్నాయి.

పంటల నమోదుకు సహకరించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్



పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉషాదయాళ్

నెక్కొండ: పంటల నమోదుకు రైతులు సహకరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ సూచించారు. మండలంలోని పత్తిపాక తండా, లావుడ్యా తండా గ్రామాల్లో బుధవారం ఆమె పంటల నమోదును పరిశీలించి మాట్లాడారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుతం వరిలో దీర్ఘకాలిక రకాల నారు పోసుకునే సమయం గడిచిందని, ఇంకా నార్లు పోయని రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో జగిత్యాల -2,3 వరంగల్ సన్నాలు, వరంగల్ సాంబ, జగిత్యాల మషూరి మధ్య కాలిక రకాలు రకాలను పోసుకోవాలన్నారు. అదేవిధంగా డబ్ల్యూజీఎల్-1119, డబ్ల్యూజీఎల్-962, ఆర్‌ఎన్‌ఆర్-15048, కేఎన్‌ఎం-1638, 733, సన్న రకాలు జేజీఎల్-24423, కేఎన్‌ఎం-118, 7037, ఎంటీయూ-1010 వంటి స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా భూసేకరణ సమస్య పరిష్కారం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాళోజీ సెంటర్: ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి ఈనెలాఖరులోగా భూసేకరణ సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టుల మెంబర్ అనిల్ చౌదని, సీఎస్ శాంతికుమారితో కలిసి రీజనల్ రింగ్ రోడ్డు, మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ కారిడార్ భూసేకరణ పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ కారిడార్ రహదారి 32 కిలోమీటర్లు వెళ్తున్నదని తెలిపారు. అందులో 160 హెక్టార్ల భూమిని సేకరించి అవార్డులు పాస్ చేసినట్లు చెప్పారు. 168 మంది లబ్ధిదారులకు రూ.10.38 కోట్లు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కు భూసేకరణ, రైల్వేకు సంబంధించిన ధరలను పరిగణనలోకి తీసుకొని గతంలోనే పరకాల ఎమ్మెల్యే, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి రైతులతో చర్చించినట్లు తెలిపారు. మరోసారి రైతులతో సమావేశం కానున్నట్లు చెప్పారు. డీఎఫ్ ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాజీపేట, వరంగల్ మీదుగా ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీ టూర్



కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ఐఆర్‌సీటీసీ దివ్య దక్షిణ జ్యోతిర్లింగ యాత్ర ప్యాకేజ్ టూర్‌ను ప్రవేశ పెట్టినట్లు యాత్ర ఇన్‌చార్జ్ కొక్కుల ప్రశాంత్ బుధవారం తెలిపారు. యాత్ర ఆగస్టు 4వ తేదీన సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై అదే నెల 12వ తేదీ వరకు సాగుతుందని తెలిపారు. యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగలు ఉంటుందన్నారు. ఈ యాత్ర ప్రత్యేక రైలు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా సాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో భాగంగా రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారన్నారు. ఈ యాత్ర రైలులో నాన్ ఏసీ క్లాస్ రూ.14,250, 3 ఏసీ క్లాస్ రూ.21,900, 2 ఏసీ క్లాస్ రూ.28,450 టికెట్లు అందుబాటులో ఉంటాయని, ఇందులో హోటల్ రూంలు, భోజనం, రోడ్డు రవాణా, ప్రయాణ బీమా, టూర్ ఎస్కార్ట్, సీసీ కెమెరాలతో కూడిన సెక్యూరిటీ ఉంటుందని తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం 9281030749, 8287932229, 8287932228 సెల్ నంబర్లలో సంప్రదించాలని, ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఆర్‌సీటీసీటీఓయూఆర్ఐఎస్ఎం.కం. వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన తెలిపారు.

గంజాయి పట్టివేత కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి పట్టివేత కేసులో నేరం నిరూపణ కాబడిన ముగ్గురు వ్యక్తుల్లో ఒక్కొక్కరికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి రావిశెట్టి యాకేష్ కథనం ప్రకారం.. జిల్లాలోని మరిపెడ పీఎస్ పరిధిలో గల పురుషోత్తమాయగూడెం గ్రామ క్రాస్ వద్ద గతేడాది ఫిబ్రవరి 4వ తేదీన మరిపెడ ఎస్సై డి.పవన్‌కుమార్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా రెండు సంచుల్లో రెండు కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని మరిపెడ పీఎస్‌కు తరలించి విచారించి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కుక్కలతండాకు చెందిన బానోత్ రమేష్, బానోత్ దుబ్లా, ఇస్లావత్ హనుమగా గుర్తించారు. ఎస్సై పవన్‌కుమార్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఝాన్సీ కేసు నమోదు చేసిన అనంతరం అప్పటి సీఐ ఎన్.సాగర్ విచారణ ప్రారంభించారు. అప్పటి సీఐ ఎల్.రాజు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా తొర్రూరు డీఎస్పీ సురేష్ పర్యవేక్షణలో ప్రస్తుత సీఐ హత్తిరాం, ఎస్సై తాహెర్‌బాబా ఆధ్వర్యంలో సీడీఓ యాకేష్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరుపణ కాబడిన ముగ్గురు వ్యక్తుల్లో ఒక్కొక్కరికి 5 సంవత్సరాల చొప్పున జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

తులసి.. మెరిసి

బుల్లితెరపై అడవి బిడ్డ అద్భుత నటన ..

- డ్రామా జూనియర్స్‌లో నటించిన ఆదివాసీ విద్యార్థిని తులసి
- అక్షరం వైపు అడుగులు వేస్తున్న ఆదివాసీ గొత్తికోయ పిల్లలు



పాఠశాలలో చదువుకుంటున్న గొత్తికోయ పిల్లలు

ఎస్ఎస్‌తాడ్వాయి : ఆదివాసీలు.. అడవి తల్లి ఒడిలోనే జీవించే ప్రజలు. ఆహారం నుంచి మొదలు.. ఆచారం వరకు, వస్త్రధారణ నుంచి.. వేషధారణ వరకు, భాష నుంచి.. యాస వరకు ఈ తెగ.. మైదాన ప్రాంత వాసులకు భిన్నం. పూర్తిగా ప్రకృతితోనే మమేకమైన జీవనం వీరిది. అయితే ఆధునిక కాలంలో ఈ తెగ ఇప్పుడిప్పుడే బాహ్య ప్రపంచంలోకి అడుగిడుతోంది. ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించడంతో విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణిస్తోంది. అంతేకాకుండా క్రీడలు, సినిమా తదితర రంగాల్లోనూ ప్రతిభచాటుతోంది. ఇందులో భాగంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయ గూడేనికి చెందిన విద్యార్థిని పునేం తులసి బుల్లితెరపై మెరిసింది. జీ తెలుగు ఛానల్‌లో ప్రసారమయ్యే 'డ్రామా' జూనియర్స్ ప్రోగ్రాంలో అద్భుతంగా నటించింది. సన్నివేశానికి తగ్గట్టు హావాభావాలు పలికించి అందరినీ ఔరా అనిపించింది.

అద్భుత ప్రతిభ..

తులసి.. డ్రామా జూనియర్ ప్రోగ్రాంలో తన గూడెంలో జరిగే సన్నివేశాలు, కుటుంబ జీవన విధానాలపై అద్భుతంగా నటించింది. ఈ ప్రోగ్రాంకు మంత్రి సీతక్క హాజరై తులసి నటించిన అద్భుత పాత్రలను వీక్షించింది. అడవి బిడ్డ అద్భుతంగా నటించడంపై సంతోషం వ్యక్తం చేసింది. తులసి కోరిక మేరకు సీతక్క గూడెంలో పాఠశాల భవనం నిర్మించింది.



డ్రామా జూనియర్స్‌లో నటిస్తున్న తులసి

అక్షరం వైపు పయనం

గ్రామాలకు దూరంగా ఉన్న అడవి బిడ్డలు అక్షరం వైపు పయనిస్తున్నారు. మండలంలోని నార్లాపూర్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో తక్కళ్లపాడు గొత్తికోయ గూడేనికి చెందిన పునేం విజయ్, విజయలక్ష్మి ఆరుగురి సంతానంలో తులసి మొదటి సంతానం. గూడెంలో భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాలలో 2వ తరగతి వరకు చదువుకున్న తులసి.. ప్రస్తుతం గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదవుతోంది. భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ నిర్వాకులు ఇస్రం సంతోష్, దుడపాక నరేష్, వీరెల్లి శేషిందర్ రెడ్డి, చందా గున్నంతరావు అటవీ ప్రాంతంలోని గొత్తికోయ గూడేల్లో పది పాఠశాలలు ఏర్పాటు చేశారు. డ్రామా జూనియర్ ప్రోగ్రాంకు పది పాఠశాలల్లోని గొత్తికోయ పిల్లలను తీసుకెళ్లగా తక్కళ్లపాడు గూడేనికి చెందిన తులసి ఎంపికైంది. ఇందులో అద్భుతంగా నటించి ఆదివాసీ గూడేనికి గుర్తింపు తీసుకువచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే తులసీ బుల్లితెరపై మరింత రాణిస్తుంది. డ్రామా జూనియర్స్‌లో తులసి నటించిన పాత్రను యూట్యూబ్, సోషల్ మీడియాలో వీక్షించిన జిల్లా ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

అడవి నుంచి పాఠశాల వైపు

ఛత్తీస్‌గఢ్ నుంచి వేలాది మంది గొత్తికోయలు కొన్నేళ్ల క్రితం వలస వచ్చారు. అటవీ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరు చెట్టు, పుట్టలకే పరిమితమయ్యారు. అయితే పిల్లలు మాత్రం చదువుల వైపు దృష్టి మళ్లించారు. గొత్తికోయ భాష తప్ప తెలుగు అర్థం కాని పరిస్థితిల్లో కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. జిల్లాలోని తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపూర్(కె) మండలాల్లోని అటవీ ప్రాంతాల్లోని చాలా మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. తలిదండ్రులకు అర్థం కాని తెలుగు భాష వారి పిల్లలు అర్థం చేసుకుంటున్నారంటే వారిలో ఉన్న పట్టుదలే కారణమని చెప్పొచ్చు.

టీచర్ అవుతా..



బాగా చదువుకుని టీచర్ అవుతా. డ్రామా జూనియర్స్ ప్రోగ్రాంలో పాత్రను నేచురల్‌గా నటించా. గూడెంలోని జీవన శైలి, కుటుంబ పోషణ విధానంపై పాత్ర చేశా. నాతోపాటు గూడెంలోని పిల్లలు అందరూ చదువుకోవాలి. మంత్రి సీతక్క పాఠశాల నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

-పునేం తులసి, ఆరోతరగతి

నాడు వరంగల్ డీఐజీ.. నేడు రాష్ట్ర డీజీపీ

- డీజీపీ జితేందర్ వరంగల్‌కు సుపరిచితుడే

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్ వరంగల్‌కు సుపరిచితుడే. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో వరంగల్ డీఐజీగా పని చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ఆయనకు 2006లో డీఐజీగా పదోన్నతి లభించింది. విశాఖపట్నం రేంజ్, 'అప్పా'లో విధులు నిర్వహించిన ఆయన 2010లో వరంగల్ రేంజ్ డీఐజీగా బదిలీ వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. అధికారులు, సహోద్యోగులను 'భయ్యా' అని సంబోధించే వ్యక్తిగా.. పోలీసుశాఖ అధికారులకు ప్రీతిపాత్రుడుగా వ్యవహరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, క్రమశిక్షణ ఉల్లంఘనలపైనా ఆయన సీరియస్‌గానే ఉన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల్లో తరచూ పర్యటించిన జితేందర్.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూశారు. 2012 వరకు వరంగల్ డీఐజీగా పనిచేసిన ఆయన హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ, మరమ్మతుల పనుల్లో అక్రమాల ఫిర్యాదులపైనా విచారణ జరిపారు. కాగా, బుధవారం తెలంగాణ డీజీపీగా జితేందర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఉమ్మడి వరంగల్ పోలీసులు, ప్రజలు ఆయనను గుర్తు చేసుకుంటున్నారు.

వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా నిర్మల



కార్యదర్శి నిర్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఛాంబర్ ప్రతినిధులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పి.నిర్మలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం బూర్గంపాడ్ మార్కెట్ స్పెషల్ సెక్రటరీగా ఉన్న నిర్మలకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా పదోన్నతి కల్పిస్తూ వరంగల్ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నియమించింది. ఈమేరకు బుధవారం నిర్మల.. ఇన్‌చార్జ్ కార్యదర్శి జి.రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాగా, నిర్మలకు ఖమ్మం, వరంగల్ జిల్లాల మార్కెట్ ఉద్యోగుల సంఘం నాయకులు, బూర్గంపాడ్, వరంగల్ మార్కెట్ కమిటీ ఉద్యోగులు పి.అశోక్, జన్ను భాస్కర్, రాము, శివకుమార్, రాజ్‌కుమార్, రాజేందర్, వెంకన్న శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఛాంబర్ ప్రతినిధులు సెక్రటరీని సన్మానించారు. కార్యక్రమంలో ఛాంబర్ ప్రతినిధులు కటకం పెంటయ్య, మొగిలి చంద్రమౌళి, మడూరు వేదప్రకాష్, సాగర్ల శ్రీనివాస్, అల్లే సంపత్, చింతలపల్లి వీరారావు, ఎస్‌రెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం దారుణం..

- చోరీకి యత్నిస్తుండగా అడ్డుపడిన వ్యక్తిని చంపిన దొంగలు
- ఈ ఘటనలో నలుగురు అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నర్సంపేట టౌన్ సీఐ రమణామూర్తి



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ రమణామూర్తి

నర్సంపేట రూరల్ : జల్సాల కోసం నలుగురు వ్యక్తులు సులభంగా డబ్బులు సంపాదించాలకున్నారు. దీనికి చోరీలను ఎంచుకున్నారు. చోరీకి వెళ్లిన క్రమంలో ఓ వ్యక్తి అడ్డుపడడంతో మద్యం మత్తులో అతడిని హత్య చేసి బావిలో వేశారు. ఈ ఘటనలో పోలీసులు నలుగురి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం నర్సంపేటలోని పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సంపేట టౌన్ సీఐ రమణామూర్తి వివరాలు వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురం గ్రామ ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎస్‌కే రహీం (44) కిరాణం షాపు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడి కుమారుడు రషీద్ అనారోగ్యం బారిన పడడంతో రహీం, అతడి భార్య షాహేదా ఖమ్మం వెళ్లారు. ఈనెల 4వ తేదీన రహీం ఒక్కడే ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇదే కాలనీకి చెందిన దారంగుల ప్రవీణ్, తాడెం శివ.. ఈనెల 6న రహీం ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. ఒక్కడే ఉంటున్నాడని నిర్ధారించుకుని అదే రోజు అర్ధరాత్రి దారంగుల ప్రవీణ్, బొంత రాజు, తాడెం పవన్, తాడెం శివ.. రహీం ఇంట్లో చోరీ చేయడానికి ప్లాన్ వేశారు. ఈ క్రమంలో ప్రవీణ్ ఒక్కడే వెళ్లి తలుపుకొట్టగా రహీం తీశాడు. దీంతో ప్రవీణ్ ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నిస్తుండగా రహీం నిలువరించాడు. ఈ క్రమంలో రహీంను ప్రవీణ్ గొంతు నులిమి చంపి మృతదేహాన్ని బావిలో పడేశాడు. అనంతరం రహీం ఇంట్లో మద్యం, సిగరెట్లు, రూ. వెయ్యి నగదు తీసుకుని నలుగురు కలిసి శివ ఇంటికి వెళ్లారు. అక్కడ మద్యం సేవించి ఖాళీ సీసాలు అక్కడే పడేసి వెళ్లారు. స్థానికులు 7వతేదీన గమనించి పోలీసులకు సమాచారం అందించడంలో వారు హుటిహుటిన ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం తరలించారు. మృతుడి కుమారుడు రషీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నర్సంపేట శివారు ఖానాపురం పాత బ్రిడ్జి వద్ద నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమణామూర్తి తెలిపారు. కాగా, కేసు చేధనలో సహకరించిన ఎస్సై ప్రవీణ్, సిబ్బంది కృష్ణ, తానేషా, జగన్, రాఘవులు, మహేష్, యుగేందర్, రమేష్, రాజును అభినందించారు.

ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ సదానందం బదిలీ

ఆయన స్థానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్ నియామకం

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ
- ఇంజనీరింగ్ డీన్‌గా సదానందం కొనసాగింపు
- బదిలీ నిలుపుదలకు యత్నాలు



మహేందర్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అలాగే ఇంజనీరింగ్ విభాగం డీన్‌గా కొనసాగుతున్న ప్రొఫెసర్ సదానందం కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అప్రూవల్ మేరకు రిజిస్ట్రార్ పి మల్లారెడ్డి ఈనెల 9న ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో ఆ రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ విశాల మహేందర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. సదానందం ఇంజనీరింగ్ విభాగం డీన్‌గా యథావిధిగా కొనసాగనున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం అప్పటి వీసీ తాటికొండ రమేష్ కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్న సదానందంను కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు.అంతేగాకుండా ఎస్‌డీఎల్‌సీఈలో ఈ–ఆఫీస్ ఇన్‌చార్జ్‌గా నియమించారు.అనంతరం యూనివర్సిటీ వెబ్‌సైట్ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు అప్పగించారు. అప్పటి వీసీ హయాంలో సదానందం ప్రొఫెసర్‌గా పదోన్నతి కూడా పొందారు. కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అయితే కొన్ని రోజుల నుంచి ప లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం బాధ్యులు రిజిస్ట్రార్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. సదానందంను యూనివర్సిటీ నుంచి కొత్తగూడేనికి బ దిలీ చేయాలని కోరుతూ వస్తున్నారు. ఈ విషయంపై ఇటీవల మల్లారెడ్డి.. ఇన్‌చార్జ్ వీసీ కరుణ దృష్టికి తీసుకెళ్లడంతో సదానందంను బదిలీ చేశారు.

బదిలీ నిలుపుదలకు యత్నాలు

ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ సదానందం తన బదిలీ నిలుపుదలకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈ బదిలీ ఉత్తర్వులు వెలువడుతున్న విషయం తెలుసుకున్న సదానందం ఈనెల 8న సాయంత్రం మూడురోజులపాటు ఈనెల 9,10,11తేదీలు సెలవు పెడుతున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. హైదరాబాద్ వెళ్లి ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణను కలిసి తన బదిలీని నిలుపుదల చేయాలని కోరినట్లు సమాచారం. తన సోదరుడు అనారోగ్య కారణాలను కూడా తెలియజేసినట్లు సమాచారం. ఏదో విధంగా ఇప్పుడే తనను యూనివర్సిటీ నుంచి రిలీవ్ చేయొద్దని ప్రయత్నాలు చేస్తున్నారని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది. రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాత్రం సదానందం బదిలీ ఉత్తర్వులను రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు పంపారు. ప్రొఫెసర్ సదానందం బుధవారం సాయంత్రం వరకు కూడా తనకు పంపిన బదిలీ ఉత్తర్వులు తీసుకోలేదని సమాచారం. ప్రిన్సిపాల్ పదవులు లేకున్నా పర్వాలేదు కాని తనను ఇక్కడే ప్రొఫెసర్‌గా కొనసాగించాలని, ఇప్పుడే రిలీవ్ చేయొద్దని ప్రయత్నాలు చేస్తూ రిజిస్ట్రార్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. అతడిని రిలీవ్ చేస్తారా లేక అలాగే కొనసాగిస్తారా అనే విషయం ఒకటిరెండు రోజుల్లో తేలిపోనుందని పలువురు భావిస్తున్నారు.

యూనివర్సిటీ వెబ్‌సైట్ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్‌గా వేణుగోపాల్‌రెడ్డి

గతంలో యూనివర్సిటీ వెబ్‌సైట్ నెట్ వర్క్ ఇన్‌చార్జ్‌గా కొనసాగిన ప్రొఫెసర్ సదానందం స్థానంలో ఈఏడాది మేలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు.అప్పుడే కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ చేయగా ఆయన అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రొఫెసర్ సదానందం మూడు రోజులపాటు సెలవుపై వెళ్లడంతో ఈ మూడు రోజులు తాత్కాలికంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వేణుగోపాల్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఒకటి రెండురోజుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేందర్ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్‌కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు.

విషకీటకం కాటు.. యువకుడి మృతి



దేవేందర్(ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లికి చెందిన రేవెల్లి దేవేందర్(23) గుర్తుతెలియని విషకీటకం కాటువేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. దేవేందర్ వ్యవసాయ పనులు ముగించుకుని మంగళవారం రాత్రి 9గంటలకు ఇంటికి వచ్చి తన కుడికాలుకు మంట వస్తుందని, ఏమో కాటు వేసినట్లు ఉందని కుటుంబీకులకు తెలిపాడు. వారు దేవేందర్‌ను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అతడు వెంటనే మహదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. మహదేవపూర్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స చేయగా పరిస్థితి విషమించింది. దీంతో వెంటనే భూపాలపల్లిలోని యోధ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీరు పారించడానికి వెళ్లి మృత్యుఒడికి..

- వ్యవసాయ బావిలో పడి రైతు మృతి
- అజ్మీరా తండాలో ఘటన

మరిపెడ రూరల్: వరి నారుకు నీరు పారించడానికి వెళ్లిన ఓ రైతు.. కాలుజారి వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అజ్మీర తండా జీపీ పరిధిలోని రెడ్యాతండాలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన భూక్య బద్దు (38) ఇటీవల తన వ్యవసాయ క్షేత్రంలో వరి నారు పోశాడు. ఈ క్రమంలో నారు మడికి నీరు పారించడానికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో కాలు జారి వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. కాగా, బావిలో మృతదేహం తేలకపోవడంతో మోటార్ల ద్వారా నీరు తోడుతున్నారు. మృతదేహం బయటకు తీయడానికి సమయం పడుతుందని ఎస్సై సంతోష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎంజీఎంలో టుడీ ఎకో తిప్పలు

ఎంజీఎం : ఎంజీఎంలో ఒకే ఒక్క కార్డియాలజిస్ట్ ఉన్నారని పేర్కొంటూ.. ఆ విభాగ సేవలపై వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. టెక్నీషియన్ లేడని పేర్కొంటూ.. టుడీ ఎకో సేవల కోసం ఎంజీఎం ఆస్పత్రి నుంచి కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీకి తరలిస్తున్నారు. కాగా.. అక్కడికి వెళ్లాక ఇక్కడ ఇప్పటికే ఎక్కువ మంది రోగులున్నారని.. వీరికి సేవలు ఎలా అందించాలని సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చివరికి రోగుల ఒత్తిడి మేరకు కుస్తీ పడితే కానీ.. సేవలు అందడం లేదు. గతంలో ఈసీజీ టెక్నీషియన్ టుడీ ఎకో సేవలు చేస్తే విమర్శలొచ్చాయని పేర్కొంటూ.. ఎంజీఎం ఆస్పత్రి రోగులను కేఎంసీకి తరలిస్తున్నారు. సమస్య పరిష్కరానికి మెడిసిన్ పీజీ, హౌజ్ సర్జన్లతో ఈ పరీక్షలు చేయించవచ్చనే విషయాన్ని విస్మరిస్తుండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రియుడి ఇంటి ఎదుట మౌనదీక్ష

- బొల్లికుంటలో ఘటన

మామునూరు: తనను మోసం చేశాడని ఓ యువతి.. ప్రియుడి ఇంటి ఎదుట మౌన దీక్ష చేపట్టింది. ఈ ఘటన బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లికి చెందిన సినపెల్లి సోని, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటకు చెందిన కన్నె బోయిన సతీష్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే పెళ్లి చేసుకోవాలని యువతి.. సతీష్‌ను నిలదీయడంతో మొఖం చాటేశాడు. దీంతో సదరు యువతి తన కుటుంబీకులతో కలిసి సతీష్ ఇంటి ఎదుట మౌన దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకూ దీక్ష విరమించేది లేదని భీష్మించింది. అప్పటి వరకు ఇంట్లోనే ఉన్న యువకుడు.. డయల్ 100 కాల్ చేసి ఇంటి తలుపులకు గడియపెట్టి పరారయ్యాడు. సమాచారం అందుకున్న మామునూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సదరు యువకుడితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని నచ్చచెప్పడంతో ఆ యువతి మౌన దీక్ష విరమించింది.

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



పద్మశ్రీ సమ్మయ్యకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి

దేవరుప్పుల: జాతీయస్థాయిలో అత్యుత్తమ గౌరవ ప్రదమైన పద్మశ్రీ పురస్కారంతోపాటు నగదు ఆర్థికంగా తోడ్పాటునందించిన సీఎంతోపాటు అందరికీ పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల నగదు పారితోషికం చెక్కును సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. ఈ విషయమై గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పురస్కారంతో పాటు ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకునేలా సంపూర్ణ సహకారాలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డితోపాటు తెలుగు భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సహాయ సంచాలకులు మామిడాల హరికృష్ణ, తన సహచర కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు.

డైరెక్టర్ పోస్టుల భర్తీ ఎప్పుడో?

- ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా సీజీఎంలు
- పదవుల కోసం 83 దరఖాస్తులు
- నాలుగు నెలలుగా ఆశావహుల ఎదురుచూపులు



హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో డైరెక్టర్ పోస్టుల భర్తీ మోక్షం లభించడం లేదు. దీంతో ఆశావహులు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా ఆషాఢ మాసం రావడంతో ఇప్పట్లో నామినేటెడ్ పదవులు నియమించే అవకాశం ఉండకపోవచ్చనే చర్చ సాగుతోంది. అయితే డైరెక్టర్ పదవుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించి నాలుగు నెలలు గడుస్తుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రస్తుత సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా పాలన సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలక మండలిని రద్దు చేసి కొత్త డైరెక్టర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్‌లో ప్రస్తుతం పని చేస్తున్న చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు డైరెక్టర్ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి సీఎండీ అన్నమనేని గోపాల్ రావు రాజీనామా చేయగా ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్ రెడ్డిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. అనంతరం జనవరి 29న నలుగురు డైరెక్టర్లను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సీఎండీకి ఆదేశాలిచ్చింది. దీంతో అదే నెల 30న చీఫ్ జనరల్ మేనేజర్లకు అదనపు డైరెక్టర్లుగా బాధ్యతలు అప్పగించారు. పర్చేజ్ అండ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న టి.సదర్‌లాల్‌ను డైరెక్టర్ ప్రాజెక్టుగా నియమించారు. ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న వి.మోహన్ రావును డైరెక్టర్ ఆపరేషన్‌గా నియమించగా జూన్ నెలాఖరులో రిటైర్డ్ అయ్యారు. ఈ స్థానంలో హెచ్ఆర్‌డీ సీజీఎం టి.మధుసూదన్‌ను ఆపరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఎంఆర్‌టీ చీఫ్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న బి.అశోక్ కుమార్‌కు డైరెక్టర్‌గా హెచ్ఆర్‌డీ, ఇండస్ట్రియల్ రిలేషన్‌షిప్‌గా నియమించారు. అప్పటికే ఫైనాన్స్ సీజీఎం ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

పూర్తిస్థాయి డైరెక్టర్ల నియామకానికి ఈ ఏడాది జనవరి 30న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 2 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించింది. హెఆర్డీ అండ్ ఐఆర్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ పదవులకు 25 చొప్పున దరఖాస్తులు, ఫైనాన్స్ డైరెక్టర్‌కు 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మొత్తం నాలుగు పదవులకు 83 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. దరఖాస్తు చేసుకున్న ఆశావహులు పదవులు దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఇతర కంపెనీలకు చెందిన అర్హులు కూడా దరఖాస్తు చేసుకోవడంతో తీవ్ర పోటీ నెలకొంది. డైరెక్టర్ పదవులు నాలుగు మాత్రమే ఉండగా ఇందులో ఇంజనీర్లకు మూడు పదవులు మాత్రమే ఉండడంతో ఎలాగైనా దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సీజీఎంలకే డైరెక్టర్లుగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. తద్వారా విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఇతరులను డైరెక్టర్లుగా నియమిస్తే ఒక్కో డైరెక్టర్‌కు జీతం, కారు, ఇతర అలవెన్సులు కలుపుకుని కంపెనీపై ఆర్థిక భారం పడనుంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థలపై భారం పడకుండా ఉండాలంటే సీజీఎంలను పూర్తి స్థాయి డైరెక్టర్లుగా నియమిస్తే సంస్థపై కొంతైనా భారం తప్పుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రిటైర్డ్ అయిన వారికి ప్రాధాన్యం ఇస్తుందా, సంస్థల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజీఎంలనే పూర్తి స్థాయి డైరెక్టర్లుగా నియమిస్తుందా అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.